


124

ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** చెరసాలలో బందీగా ఉన్న మురారిదేవుణ్ని విడిపించాడు జాయచోడుడు. మూర్తీభవించిన రాజరికపు మూర్ఖత్వంలా ఉన్నాడు మురారి. మేనల్లుడితో కలిసి పాకనాడు వెళ్లిన జాయచోడుడు.. అక్కడ మురారి ఏర్పరచుకున్న రాజవ్యవస్థను చూసి అవాక్కయ్యాడు. ఆ చిన్న సామంతరాజ్యాన్ని తన సామ్రాజ్యంగా రూపొందించుకుని.. ఇష్టారాజ్యంగా పరిపాలిస్తున్నాడు. ఆదిమకాలపు గణనాయకునిలా పూర్తి నిరంకుశపాలనతో ఆనందంగా జీవిస్తున్నాడు. కొడుకు పాలన చూస్తే చక్రవర్తి గుండె ఆగిపోతుందని అనుకున్నాడు జాయచోడుడు.

రెండేళ్లుగా గణపతిదేవుడు, రాణి రుద్రమదేవి యుద్ధాలలో మునిగి ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించగా.. మురారి పరిపాలన మొత్తంగా తన చేతుల్లోకి తీసుకున్నాడు. తనకు అనుకూలమైన ఓ అధికార బృందాన్ని కూడా రూపొందించుకుంటున్నాడని వేగు అంకమరట్ట నివేదిక. అనుమకొండ కోశాగారానికి దినదినమూ వేలకోట్లు ఆదాయం వస్తుంది. విధివిధానాలు క్రమబద్ధం చెయ్యడం వల్ల ధనం, లెక్కలు పక్కదారి పట్టించడం అధికారులకు అవకాశం ఉండదని ఆయన అభిప్రాయం. చక్రవర్తి అన్నిటినీ క్రమబద్ధం చేస్తాడు కానీ, పన్ను వసూళ్లలో కాస్త మెతక. చూసీ చూడకుండా పోతాడు. ఇది మురారికి నచ్చడం లేదు.

అందుకే.. ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నాడు. భయపెట్టి బెంబేలెత్తిస్తున్నాడు. మోసం, పద్దుల్లో తేడాలు కనిపిస్తే తీవ్రమైన శిక్షలు విధిస్తున్నాడు.

చక్రవర్తి సంస్కరించి క్రమబద్ధం చేసిన నియోగాలపై మురారి దృష్టి కేంద్రీకరించాడు. అలాంటి వాటిలో పన్నుల నియోగం అతని కంటపడింది. పన్నుల వసూలుపై దృష్టి కేంద్రీకరించాడు. కోశాగారానికి ఎక్కువ ఆదాయం ఈ పన్నుల నియోగం నుంచే వస్తుంది కాబట్టి పన్నుల వసూలు సక్రమంగా ఉన్నదో లేదో శల్యపరీక్ష చేస్తున్నాడు. భయపడినంతా అయ్యింది.

ఒకచోట పన్ను వసూలులో అలక్ష్యం దృష్టికొచ్చింది.

జంతువులపై పన్ను కోశాగారానికి అతిముఖ్యమైన ఆదాయం. ప్రతివారి ఇంటా జంతువులు ఉంటాయి. గ్రామీణులకు పశువులే సమస్తం. ఈ పశుగుంపులపై అరి, అప్పనం, పుల్లరి అనే మూడు పన్నులు విధిస్తారు. గొల్లలు, మాదిగలు.. మొదలైన వృత్తులవాళ్లు బాగా స్థితిమంతులు. మంచి ఆదాయం, ఆస్తులున్న వృత్తులు వీరివి. పశువులపై పన్నులన్నీ ఎలాంటి మినహాయింపులు కోరకుండా చెల్లిస్తారు.

దేవాలయాలకు అంగరంగవైభవ నిమిత్తం దానమిచ్చిన పశువులపై పన్నుల్లో మినహాయింపులు ఉంటాయి. కానీ, అవి పద్దుల్లో స్పష్టంగా రాసి లేదు. మాటకు కట్టుబడి కార్యకలాపాలు నిర్వహించే ధర్మకాలం కాబట్టి గుళ్లకు ఇచ్చిన పశువులు కాబట్టి పన్ను మినహాయింపు ఉండే ఉంటుందని అధికారులు పట్టించుకోలేదు.

ఇదే పెద్దదోషంగా మురారిదేవుడు ఎత్తి చూపాడు. కోపంతో ఉగ్రుడైపోయాడు. ఈ తప్పునకు కారణమైన ఉద్యోగులు ఇద్దరు. మాచయశర్మ, వీరాయ. ఇద్దరిని తక్షణమే తన ముందు ప్రవేశపెట్టమన్నాడు. ఇద్దరూ వచ్చి అతనికి సాష్టాంగ ప్రమాణం చేశారు.

నియోగాధిపతి మాచయశర్మ యువరాజుగారి ఆగ్రహావేశాలను చూసి, అవి గుడికి దానమిచ్చిన పశువులే కానీ పన్ను మినహాయింపు ఉన్నదో లేదో తనకు తెలియదని.. వసూలు బాధ్యత తనది కాదని.. వీరాయదేనని నమ్మబలికాడు. అనేక తర్జన భర్జనల అనంతరం ఇద్దరికి కొరత వేయడం శిక్షగా నిర్ణయించాడు మురారి. తలారి బృందానికి శిక్ష అమలు చేయవలసిందిగా ఆదేశించి సభ చాలించాడు. అయితే అప్పుడే తలారి..

''మాచయశర్మ కులీనుడు, పండితుడు కాబట్టి ఆయనకు శిక్షను మినహాయించారని, వీరాయ పంచముడు, అసలు తప్పు చేసినవాడు కాబట్టి అతను శిక్షార్హుడు!'' అని నొక్కి వక్కాణించాడు.

దీని పర్యవసానం తెలియని మురారి..